ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 18 మే 2025 www.prajaswaramdaily.com


# ఇదే తరహాలో ఆపరేషన్ సిందూర్: ధన్‌ఖడ్

**ముపెన్నడూ లేని విధంగా భారత్**

**పాక్లోకి చొచ్చుకెళ్లి ఉగ్రమూకల ఏరివేత : ఉపరాష్ట్రపతి ధన్ ఖడ్**



న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ పై తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా హతమార్చిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాక్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరివేసిందని వ్యాఖ్యానించారు. 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయని అతని పేరు ప్రస్తావించకుండా మాట్లాడారు. "ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక బెంచ్ మార్క్‌ను నిర్ణయించింది" అని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లిందని అన్నారు. భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే దేశాల ఆర్థిక వ్యవస్థలకు సాయం చేయలేమని అన్నారు. మనలో ప్రతి ఒక్కరు ఆర్థిక జాతీయవాదం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.
పాకిస్థాన్‌కు వత్తాసు పలికిన తుర్కియే, అజర్‌బైజాన్‌లపై భారత్‌లో బాయ్‌కాట్ నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మావోయిస్టులకు ఎదురుదెబ్బ

**ములుగు జిల్లాలో 20 మంది అరెస్ట్**

**లొంగిపోయిన.. 8 మంది**

**ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్..**



ములుగు : ములుగు జిల్లాలో మావోయిస్టులకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్ చూపిస్తుంది. సుమారు ఎనిమిది మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోగా, మరో 20 మంది అరెస్ట్ అయ్యారు. వారి దగ్గర నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ శబరిష్ ఎదుట వివిధ హోదాల్లో పని చేస్తున్న మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోవడానికి నక్సలైట్లు సుముఖత చూపిస్తున్నారు. పోలీసులు నిర్వహిస్తున్న పోరు కన్నా-ఊరు మిన్న.. మన ఊరుకి తిరిగు రండి అనే కార్యక్రమంతో సత్ఫలితాలు ఇస్తున్నాయి. అయితే, లొంగిపోయిన మావోయిస్టుల మీద ఉన్న రివార్డులు 24 గంటల్లో వారీ ఆకౌంట్లో జమ చేస్తున్నామని ఎస్పీ శబరిష్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకి పునరావాసం కల్పించి అన్ని విధాల ఆదుకుంటాం అని హామీ ఇచ్చారు. వారి ఆరోగ్య సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం అని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలి అని పిలుపునిచ్చారు.

# కోటి మంది మహిళలు కోటీశ్వరులవ్వాలన్నదే లక్ష్యం

**మహిళా శక్తిని ఎప్పుడూ గౌరవిస్తున్న కాంగ్రెస్**

**మహిళా శక్తిని ఇందిరాగాంధీ ప్రపంచానికి చూపించారు**

**ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం**

**రూ.5,200 కోట్లను మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి ఇచ్చాం :సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ : మహిళల శక్తిని ప్రేరణగా తీసుకుని, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మహిళా స్టాళ్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా శక్తిని ఎప్పుడూ గౌరవిస్తుందని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. రూ.5,200 కోట్లను మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి ఇచ్చామని, ఆర్టీసీ కూడా ఇప్పుడు లాభాల బాటలో నడుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.
ఇందిరా గాంధీ మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనతవహించిందన్నారు. మన రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలంటే, మహిళలు ఆర్థికంగా స్వావలంబులవ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలు తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. గ్యాస్ సిలిండర్లను రూ.500కే అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతను మహిళలకు అప్పగించామని, మహిళా సంఘాలు, సొంత వ్యాపారాలు పెరిగేలా స్టార్టప్ మద్దతు ఇస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఈ నెల 21న "ఇందిరా మహిళా స్టాళ్లను" మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నట్లు సీఎం వెల్లడించారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. "కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇచ్చినప్పుడు వారు దేశం విడిచి వెళ్తున్నారు. కానీ మహిళలకు ఇచ్చే రూపాయికి విలువ ఉంది.. వారు సమర్థంగా వినియోగించి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తున్నారు," అని చెప్పారు.



# మంత్రి శ్రీధర్‌బాబుపై కేసు కొట్టివేత

**2017లో రైతులు కోల్పోతున్నరైతుల తరపున పోరాడితే కేసులు**

**చివరికి న్యాయం గెలిచిందన్న మినిస్టర్**



హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబుపై సహా 13 మందిపై నమోదైన కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్‌బాబుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసును కోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో భూములు కోల్పోతున్న రైతుల తరపున పోరాడితే కేసులు పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు. " కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడేందుకు వినతిపత్రాన్ని ఇవ్వాలని వెళ్లాం. అధికారం అండతో మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్లపాటు ఈ కేసు నడిచింది. తాజాగా న్యాయస్థానం కొట్టివేసింది. ఇది ప్రజా విజయం. రైతుల విజయం. పేద రైతు ఘోషను న్యాయస్థానం విన్నది. అధికారం ఉందని నాడు కేసులు పెట్టారు. పోలీసులను అడ్డగోలుగా వినియోగించుకున్నారు. కానీ, ఇవాళ ప్రజాస్వామ్యం ఉంది. చట్టాలను నమ్ముతూ మేం ముందుకు వెళ్తున్నాం. మాకు అధికారం ఉందని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదు. భారాస ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిలవలేదు. దానిపైనా విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందే" అని అన్నారు.

# హర్యానాలో పాక్ గూఢచారుల గుట్టురట్టు..

**యూట్యూబర్ సహా ఆరుగురి అరెస్ట్**

చండీగఢ్ : హర్యానాలో గూఢచారుల గుట్టురట్టయింది. ట్రావెల్ విత్ జో అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న జ్యోతి మల్హోత్రా అనే యూట్యూబర్, మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రావెల్ వీసా మీద పాకిస్తాన్ లో పర్యటించిన జ్యోతి.. భారత సైనిక సమాచారాన్ని పాక్ కు చేరవేసినట్లు గుర్తించారు. జ్యోతి మల్హోత్రా పాక్ ఐఎస్ఐ ఏజెంట్ గా పనిచేసినట్లు గుర్తించిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. మల్హోత్రా, పాకిస్తాన్‌తో రహస్య సైనిక సమాచారాన్ని పంచుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పాకిస్తాన్ హై కమిషన్ అధికారి డానిష్ తో ఆమెకు సంబంధాలున్నాయని, ఆమె పాకిస్తాన్ కు వెళ్లినప్పుడు సమాచారం లీక్ చేసిందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ఆర్టీసీ బస్‌లో మంత్రి ప్రయాణం

**మహిళలతో పొన్నం ముచ్చట**

**సంక్షేమ పథకాలపై అవగాహన**



హైదరాబాద్: ఆర్టీసీ బస్సులో మంత్రి పొన్నం ప్రయాణించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి , రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్తో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో సాధారణంగా టికెట్ తీసుకొని ప్రయాణించారు. పంజాగుట్ట నుంచి లక్డికపూల్ వరకు బస్సు ప్రయాణం చేస్తూ, వారు ఇతర ప్రయాణికులతోపాటు మహిళలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహా లక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఉద్యోగానికి వెళ్లే మహిళలు, అవసరాల నిమిత్తం ప్రయాణించే వారు ఈ పథకంతో ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడిన మంత్రి, వారి అభిప్రాయాలను స్వయంగా వినడంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.
మహిళలు కూడా ఉచిత ప్రయాణం పథకం వల్ల నెలకు ఎంతో డబ్బు ఆదా అవుతోందని, అది తమ కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఎంతో తోడ్పడుతోందని తెలియజేశారు. ఇటీవలే నగరంలో పెద్ద మొత్తంలో బస్సులను ప్రవేశపెట్టామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంతేగాక, ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేరువగా ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.
సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో పాటు, మహిళా సంఘాలను ఆర్థికంగా చురుకుగా మార్చే లక్ష్యంతో అనేక ప్రత్యేక పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చినదని మంత్రి వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంగా తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వారి సమస్యలను గౌరవప్రదంగా పరిష్కరిస్తూ, రవాణా సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# అద్భుతమైన మైలురాయిని సాధించావు

**నీరజ్ చోప్రాకు ప్రధాని మోదీ ప్రశంసలు**

**దోహా డైమండ్ లీగ్‌లో అదరగొట్టిన చోప్రా**

**కెరీర్‌లోనే తొలిసారి 90.23 మీటర్ల మార్క్ అందుకున్న వైనం**



న్యూఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మైలురాయిని సాధించావని ప్రధాని మోదీ ప్రశంసించారు. దోహా వేదికగా మొదలైన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా తన కెరీర్‌లోనే తొలిసారి 90.23 మీటర్ల మార్క్ అందుకున్నాడు. గతంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (89.94 మీటర్లు)ను భారత గోల్డెన్ బాయ్ అధిగమించాడు. ఈ లీగ్‌లో మాత్రం మనోడు రెండో స్థానానికే పరిమితమయ్యాడు. జర్మనీకి చెందిన అథ్లెట్ జులియన్ వెబర్ బల్లెంను ఏకంగా 91.06 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అభినందించారు. అద్భుతమైన మైలురాయిని సాధించావు, దేశం ఉప్పొంగి, గర్వంగా ఉంది అంటూ నీరజ్‌ను ప్రధాని మెచ్చుకున్నారు. "అద్భుతమైన ఫీట్! దోహా డైమండ్ లీగ్ 2025లో 90 మీటర్ల మార్కును అధిగమించి తన వ్యక్తిగత అత్యుత్తమ త్రోను సాధించినందుకు చోప్రాకు అభినందనలు. ఇది అతని అవిశ్రాంత అంకితభావం, క్రమశిక్షణ, అభిరుచికి దక్కిన ఫలితం. భారతదేశం ఉప్పొంగి, గర్వంగా ఉంది" అని మోదీ ట్వీట్ చేశారు.